క్లుప్తంగా

సివిల్ సర్వెంట్లుగా గుర్తించాలి

మైదుకూరు : గ్రామీణ డాక్ సేవకులను సివిల్ సర్వెంట్లుగా గుర్తించాలని కోరుతూ మైదుకూరులో రెండో రోజు బుధవారం పోస్టల్ సిబ్బంది ధర్నా నిర్వహించారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా తాము సమ్మె చేస్తున్నట్టు ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డాక్ సేవక్స్ నాయకులు తెలిపారు. తమకు గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని, గ్రాట్యుటీని రూ.5లక్షలకు పెంచాలని గ్రామీణ డాక్ సేవకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సలీం, రమణ, బ్రహ్మం, సాయి, నూరుల్లా, వెంకటేష్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

చాపాడు : మండల పరిధిలోని అయ్యవారిపల్లె వద్ద ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రొద్దుటూరు డివిజన్ డిప్యూటీ ఈఓ కృష్ణప్ప బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలలో రాష్ట్రస్థాయిలో ప్రతిభచాటిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం గుర్రప్ప పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : పదో తరగతిలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉప విద్యాశాఖాధికారి జి.కృష్ణప్ప తెలిపారు. మండలంలోని తాళ్లమాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను బుధవారం ఉపవిద్యాశాఖాధికారి కృష్ణప్ప సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలోని తరగతి గదులను, మధ్యాహ్న భోజనం, మరుగుదొడ్ల పరిశుభ్రతను పరిశీలించారు. ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్, డైరీలను తనిఖీ చేశారు. విద్యా విషయాలపై ప్రధానోపాధ్యాయుడు వై.గోపీనాథరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఇష్టపడి చదవి, ఉన్నత స్థానాలకు చేరుకోవాలని తెలిపారు. వారి ప్రోగ్రెస్ కార్డులను పరిశీలించారు.

బద్వేలు డిపో ఆదాయం రూ.10.71 లక్షలు

బద్వేలు అర్బన్ : కార్తీక మాసం సందర్భంగా బద్వేలు డిపో నుండి వివిధ ప్రాంతాలకు నడిపిన ప్రత్యేక బస్సుల ద్వారా రూ.10.71 లక్షల ఆదాయం లభించినట్లు డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరుణాచలం యాత్రకు 13 బస్సులు, త్రిలింగ దర్శనం – శ్రీశైలంకు 2, సింహాచలం – అరకులోయ 1, పంచక్షేత్రాలు 4, లంకమల 4 చొప్పున బస్సులు నడిపామని తెలిపారు.

శబరిమలకు ప్రత్యేక బస్సులు :
శబరిమల అయ్యప్పస్వామి దర్శనం కోసం 36 మంది అయ్యప్ప భక్తులు బృందంగా ఏర్పడితే బద్వేలు నుంచి ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సు నడుపుతామని డీఎం తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులో ఒక గురుస్వామి, మణికంఠ, వంట మనిషులకు కలిపి 7 మందికి ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. అయ్యప్ప భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బి.మఠం అభివృద్ధికి కృషి

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రమైన బ్రహ్మంగారి మఠం అభివృద్ధికి ప్రభుత్వం శాయశక్తులా కృషి చేస్తోందని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ త్వరలో బి.మఠంలోని నాలుగు రోడ్ల కూడలిలో కాలజ్ఞాన ప్రబోధకర్త శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి వారి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇందుకు అందరి సహకారం అవసరమన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మఠం అభివృద్ధికి చర్యలు చేపట్టామన్నారు. సీసీ రోడ్లు, ఆక్రమణల తొలగింపు, బ్రహ్మంగారి నివాసం వద్ద రోడ్ల నిర్మాణం చేశామన్నారు. బి.మఠంకు ఆర్టీసీ డిపో, బస్టాండ్ తీసుకురావడంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కృషి చేశారన్నారు. గత ప్రభుత్వాలు మఠం అభివృద్ధిని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సహకారంతో జెడ్పీటీసీతో కలిసి మఠాన్ని మరింత అభివృద్ధి చేసేలా ముందుకెళ్తామని తెలియజేశారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

పోరుమామిళ్ల : భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు గండి సునీల్‌కుమార్, సహాయ కార్యదర్శి రవికుమార్ పిలుపిచ్చారు. బుధవారం పోరుమామిళ్లలో మహాసభల పోస్టర్లను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 18, 19 తేదీలలో పోరుమామిళ్లలో మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతినిధులు హాజరవుతారని జయప్రదం చేయాలని విద్యార్థులకు పిలుపిచ్చారు.

ఘనంగా గ్రామోత్సవం

దువ్వూరు : మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని అయ్యప్పస్వామి, గోవిందస్వాముల సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి, శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి, శివపార్వతుల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేసి రథంపై కొలువుదీర్చి గంగమ్మ ఆలయానికి తీసుకొచ్చారు. అక్కడి నుంచి పురవీధుల ఊరేగించారు. భక్తిపాటలు పాడుతూ మేళతాళాలతో గ్రామోత్సవం వినాయక గుడి వరకు సాగింది. అనంతరం వినాయక గుడి వద్ద అయ్యప్పస్వామి పడిపూజను నిర్వహించారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం


ప్రొద్దుటూరు : పథకాల వివరాల బోర్డును ఆవిష్కరిస్తున్న భీమునిపల్లి లక్ష్మీదేవి, నాయకులు


చాపాడు: వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు


పోరుమామిళ్ల : వలంటీర్లకు కిట్లు అందజేస్తున్న నాయకులు

ప్రొద్దుటూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు తెలిపారు. బుధవారం మున్సిపాలిటీలోని 21వ వార్డు పరిధిలోని 24వ సచివాలయంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సహకారంతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు డ్రైనేజి కాలువలను నిర్మించామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద మాట్లాడారు. డీబీటీ, నాన్ డీబీటీ ప్రయోజనాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ మునిరత్నం, 22వ వార్డు ఇన్‌చార్జి హిదాయత్, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహులు, నాగరాజు, నాయబ్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి సీఎం కృషి
సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి , అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ తెలిపారు. మండలంలోని ఉప్పరపల్లె గ్రామ సచివాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మార్తల ఓబుళరెడ్డి, సర్పంచ్ రమణారెడ్డి, సచివాలయ కన్వీనర్లు ఫక్రుద్దీన్, వెంకటరమణ, బంకచిన్నాయపల్లె రాజేష్ పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధిని ప్రజలకు వివరించండి
చాపాడు : వెదురూరు గ్రామ పంచాయతీ పరిధిలో గత నాలుగేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.25.10కోట్లతో ఇంటింటికి సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేపట్టిందని ఎంపీపీ లక్షుమయ్య తెలిపారు. మండలంలోని వెదురూరు గ్రామ సచివాలయం వద్ద బుధవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు, గృహసారథులు ఇంటింటికి వెళ్లి సీఎం వైఎస్ జగన్ ప్రజలకు చేసిన మంచిని వివరించాలన్నారు. అనంతరంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం చేసిన ఖర్చు వివరాలతో ఏర్పాటు చేసిన డిస్ ప్లే బోర్డును ప్రదర్శించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఎంపీటీసీ శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎల్లారెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే జగనన్నతోనే సాధ్యం
పోరుమామిళ్ల : రాష్ట్రం గత నాలుగున్నర సంవత్సరాల్లో సంక్షేమంలో, అభివద్ధిలో ముందుకు పోయిందని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలే కాక ఇవ్వనివి కూడా అమలు చేశారని జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సీఎం బాషా, రాజశేఖర్, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. బుధవారం చల్లగిరిగెల సచివాలయం వద్ద జరిగిన మళ్లీ జగనన్నే ఎందుకు కావాలి కార్యక్రమంలో వారు మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో అవినీతి రాజ్యమేలిందని, ఇప్పుడు కుల, మత, వర్గం, పార్టీ తేడాలు చూడకుండా ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా లబ్ధిదారుల అకౌంటుకే నేరుగా జమ అవుతున్న విషయం మీకు తెలిసిందే అన్నారు. అందుకే మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రిగా ఎన్నుకుందామన్నారు. అనంతరం పార్టీ జండా ఎగురవేసి వలంటీర్లకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాదరావు, రమణారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు అండగా నిలవండి
బద్వేలు అర్బన్ : కులం, మతం, పార్టీ చూడకుండా అన్నివర్గాల ప్రజలకు అండగా నిలుస్తూ సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరు అండగా నిలవాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని సురేంద్రనగర్ సచివాలయం పరిధిలో బుధవారం ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి లబ్ధిని తెలిపే బోర్డును ప్రదర్శించారు. సచివాలయ పరిధిలోని ప్రజలకు ప్రత్యక్ష నగదు బదిలీ కింద రూ.10.42 కోట్లు, పరోక్ష నగదు బదిలీ కింద రూ.6.54 కోట్లు చొప్పున మొత్తం రూ.16.96 కోట్లు నిధులు జమ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల్లో జగన్‌ను మళ్ళీ ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి పుస్తకాలను విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ యద్దారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లాబకాష్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన


రైతులకు మోటార్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ

బద్వేలు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు తెలిపారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ జలకళ పథకంలో భాగంగా మంజూరైన మోటార్లు, స్టాటర్లు, పైపులను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగునీటి వసతి లేని భూములను సైతం సస్యశ్యామలం చేయాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వైఎస్సార్ జలకళ పథకానికి శ్రీకారం చుట్టారని అన్నారు. ఈ పథకంలో భాగంగా తొలుత రైతులకు ఉచితంగా బోర్లు మాత్రమే వేయిస్తామని ప్రకటించినప్పటికీ రైతుల సంక్షేమం కోసం ఉచితంగా మోటార్లు, స్టాటర్లు కూడా అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికి సుమారు 81 మంది రైతులకు మోటార్లు పంపిణీ చేయడం జరిగిందని, అలాగే 550 బోర్ల ఏర్పాటుకు అనుమతి లభించిందని, త్వరలోనే వీటిని ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ ఖాదర్‌బాషా, కుడా చైర్మన్ గురుమోహన్, డీఎల్‌డీఏ చైర్మన్ మాధవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాశ్రీరాములు, మాజీ జెడ్పీటీసీ రామకృష్ణారెడ్డి, బి.కోడూరు జెడ్పీటీసీ ఎస్.దావీదు, సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మండల కన్వీనర్లు మల్లేశ్వర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు

బద్వేలు అర్బన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సుధ తెలిపారు. మున్సిపాలిటీ పరిధి 4వ వార్డులోని మడకలవారిపల్లెలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించారు. గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో పథకాల ద్వారా ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేయడంతో పాటు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షులు సుందర్‌రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాశ్రీరాములు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, ఇన్‌చార్జిలు రఘురామిరెడ్డి, చెన్నయ్య, ఓబుల్‌రెడ్డి, కేశవరెడ్డి, నాగేశ్వర్‌రావు, రెడ్డెయ్య, సుబ్బరాజా, శంకర్‌రెడ్డి, శివారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, పుల్లారెడ్డి, చిన్న గంగయ్య, మున్సిపల్ డీఈ సుమన్‌రెడ్డి పాల్గొన్నారు.

కలసపాడులో..
కలసపాడు : మండలంలోని పుల్లారెడ్డిపల్లె గ్రామంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్ళి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుండి వర్తించిన వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సూదా రామకృష్ణారెడ్డి, సుదర్శన్, పురుషోత్తంరెడ్డి, నారాయణయాదవ్, చిత్తారాజశేఖర్‌రెడ్డి, ఎ.విజయభాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, సర్పంచ్ ఓబులమ్మ, సింగరయ్య, ఈఓపీఆర్డీ మురారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

పోరుమామిళ్ల : అంగన్‌వాడీ హెల్పర్లు, వర్కర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చెన్నయ్య, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్, యూనియన్ నాయకులు బొజ్జా చిన్నయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఐసీడీయస్ కార్యాలయం ఎదుట బుధవారం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల వద్దకు వారు వెళ్లి మాట్లాడారు.

ప్రొద్దుటూరు : అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ, సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్లు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రొద్దుటూరు అర్బన్, రూరల్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ నజీర్ అహ్మద్‌కు వినతి పత్రం ఇచ్చారు.

మైదుకూరు : పని భారం తగ్గించి, మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చాలని కోరుతూ మైదుకూరులో రెండో రోజు బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద మైదుకూరు, ఖాజీపేట మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ ధర్నా చేపట్టారు.

దువ్వూరు : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ నాయకురాళ్లు దాక్షాయణి, అయేషా మాట్లాడారు.

తెలుగు మహాసభలకు సంచాలకులుగా బొల్లు

పోరుమామిళ్ల : 2024 జనవరిలో రాజమహేంద్రవరంలో జరుగనున్న అంతర్జాతీయ 2వ తెలుగు మహాసభలకు ఉత్సవ కమిటీ సంచాలకులుగా పోరుమామిళ్లకు చెందిన రచయిత, కవి బొల్లు రామమోహన్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఆయనకు నియామక పత్రం ఇచ్చారు. 15 మంది కవులతో ఉత్సవ కమిటీని ఏర్పాటు చేశారు. తెలుగు భాషలోని 25 ప్రక్రియలపై సదస్సులు ఏర్పాటు చేశారు. కవి సమ్మేళనంలో కవిత, గేయం, పద్యం, హైకు, నానీ, గజల్, తెలుగు రూపాయి, కథలకు అవకాశం కల్పిస్తున్నారని, నూతన గ్రంథాల ఆవిష్కరణ జరుగుతుందని బొల్లు రామమోహన్ తెలిపారు.

ముమ్మరంగా రోడ్డు పనులు

చాపాడు : మండల పరిధిలోని నక్కలదిన్నె – వెదురూరు రహదారిని రూ. 2.30కోట్లతో పునర్నిర్మాణం చేపట్టారు. గత కొన్ని రోజులుగా పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ముందుగా తిప్పిరెడ్డిపల్లె వంక, గ్రామ వద్ద రూ. 36లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నారు. అనంతరం నక్కలదిన్నె నుంచి వెదురూరు గ్రామం వరకు తారురోడ్డు నిర్మాణ పనులు చేస్తామని ఆర్ అండ్ బీ ఏఈ దాదాబాషా తెలిపారు. గత వేసవి కాలంలో చాపాడు నుంచి నక్కలదిన్నె వరకు తారురోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా రెండో విడతగా నక్కలదిన్నె నుంచి వెదురూరు వరకు పనులు చేపడతామన్నారు. జనవరి మొదటి వారంలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తవుతాయన్నారు.

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య

ప్రొద్దుటూరు : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య తెలిపారు. మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలపై అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 15 నుంచి 2024 జనవరి 22వ తేదీ వరకు క్రీడా పోటీలు జరుగుతాయని తెలిపారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీల్లో ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ప్రభుత్వం క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, పద్మశాలి కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, రాజుపాళెం ఎంపీడీఓ వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల అధ్యక్షులు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి, జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యురాలు కొండా ధనలక్ష్మి, గుమ్మళ్ల పద్మ, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయాలి
గోపవరం : ఈనెల 15 నుండి నిర్వహించే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. అన్ని సచివాలయాల పరిధిలో వివిధ ఆటలపోటీల్లో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకున్న యువతీ యువకులు వివిధ ఆటలకు సంబంధించి ప్రాక్టీస్ ముమ్మరం చేసినట్లు ఆయన తెలిపారు. క్రికెట్, వాలీబాల్, బాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ తదితర పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటికి సంబంధించిన కిట్లను ఆయా పాఠశాలలకు ఇవ్వడం జరిగిందన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలి

ప్రొద్దుటూరు : ఆర్టీసీ అభివృద్ధికి అందరూ సహకరించాలని ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆర్టీసీ డిపో ఆవరణలో ఎక్కువ డీజల్ ఆదా చేసిన, అధిక ఆదాయం తీసుకొచ్చిన డ్రైవర్లు వైవీ రెడ్డి, ఈహెచ్ సాహెబ్, కండక్టర్లు జీవీ వెంకటేశ్వర్లు, బీసీఎల్ దేవిలకు ఆర్టీఓ వేణు ప్రశంసా పత్రాలు అందించారు. వీరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

మైదుకూరు : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మైదుకూరు ఆర్టీసీ డిపో వద్ద రెండో రోజు బుధవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. అధికారుల నిర్లక్ష్యానికి నిరసనగా ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలను ధరించారు. అసోసియేషన్ నాయకులు బీఎస్ రెడ్డి, జీబీ సిద్దయ్య, వీఎస్ రాయుడు, వీరన్న, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు ఆర్టీసీ ఉద్యోగుల నిరసన
ప్రొద్దుటూరు : స్థానిక ఆర్టీసీ డిపో వద్ద రెండో రోజు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జోనల్ నాయకుడు వీఆర్ కృష్ణయ్య, రీజనల్ నాయకుడు ఎస్ఎస్ నారాయణ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర నాయకులు జీఓలు విడుదల చేయిస్తున్నప్పటికీ అవి అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిపో నాయకుడు విశ్వనాథ రెడ్డి , టీఆర్‌జీ రెడ్డి, గ్యారేజి సెక్రటరీ అశోక్, టి.బాబయ్య, డిపో ట్రెజరర్ బాబు పాల్గొన్నారు.

పరిమితి లేని వైద్యాన్ని కొనసాగించాలి
బద్వేలు అర్బన్ : ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ నుంచి మినహాయింపు ఇచ్చి సంస్థలో ఇదివరకే ఉన్న పరిమితిలేని వైద్యం విధానాన్ని కొనసాగించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.జనార్దన్ రావు, డి.చంద్రయ్యలు తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం డిపో గ్యారేజీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులందరికి వేతనాలతో కూడిన సెలవులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్యారేజీ సెక్రటరీ నాగేంద్ర, సీసీఎస్ డెలిగేట్ మల్లికార్జున, సంఘం నాయకులు పాల్గొన్నారు.

అక్షింతలను పంపిణీ చేయాలి

రాజుపాళెం : అయోధ్య రామ జన్మభూమి నుండి శ్రీరాముడిని వేద మంత్రాలతో పూజించిన అక్షింతలను గ్రామాల్లోని ఇంటింటికి పంపిణీ చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా ఆర్గనైజర్ మల్లిఖార్జున రావు పేర్కొన్నారు. రాజుపాళెంలోని శ్రీకోదండ రామాలయంలో బుధవారం గ్రామాల వారికి ఆయన అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న ప్యాకెట్‌లో వేసి జనవరి 1 నుంచి ఈ అక్షింతలతో పాటు కరపత్రం, రామ మందిరం ఫొటో ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి మురళీకృష్ణ, ధర్మ ప్రచార ప్రముఖ్ చౌడయ్య, సురేష్, చంద్రఓబుళ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాల తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలోని ప్రభుత్వ వైద్యశాల అత్యంత ఆధునిక సదుపాయాలతో, అన్ని విభాగాలకు చెందిన వైద్యులతో ప్రైవేటు ఆసుపత్రులకన్నా మిన్నగా ఉందని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారులు నాగార్జునరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన 50 పడకల ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసి ఆసుపత్రిలో పని చేస్తున్న వైద్యుల వివరాలు, సిబ్బంది వివరాలు సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటనాగేంద్రను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం 8 మంది వైద్యులు ఉన్నారని, బుధవారం ఇద్దరు సెలవులో ఉండగా 6 మంది విధుల్లో ఉన్నట్లు వివరించారు. గతంలో రోజుకు 150 మంది రోగులు వస్తుండగా ఇపుడు 350 మంది వస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన రికార్డులను పరిశీలించి అక్కడ ఉన్న రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలో గైనకాలజిస్ట్, డెంటల్, ఆర్థో, ఫిజియోథెరఫీ, చిన్నపిల్లల వైద్యులు ఉన్నారన్నారు. అన్ని విభాగాలకు చెందిన వైద్యులు ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని అందరూ వినియోగించుకోవాలన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను బుధవారం ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ గీత సందర్శించారు. బాలికల చదువు, ఆరోగ్యం గురించి ఆమె విచారించారు. ఈ సందర్భంగా సదస్సు నిర్వహించి యుక్త వయసులో అమ్మాయిలలో శారీరక మార్పులు, ఋతుక్రమం తదితర అంశాలపై వివరించారు.